## ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో అర్హులే ఉండాలి

**ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే**


వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మే 8 : ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో అర్హులే ఉండాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం ఆసిఫాబాద్ పట్టణంలోని ఐదో వార్డు పరిధిలోగల బజార్‌వాడీలో సాహెరా బేగం ఇంటిని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హత గల లబ్ధిదారులకు సొంత ఇంటి స్థలం ఉండాలని, నిబంధనల ప్రకారం 600 చదరపు అడుగుల లోపు ఇంటి నిర్మాణం చేపట్టాలని తెలిపారు. లబ్ధిదారులే ఇండ్లు నిర్మించుకోవాలని, పనులు పూర్తయిన ప్రకారంగా నిధులు మంజూరు చేస్తారన్నారు. పరిశీలన అధికారి రాజ్ కుమార్ ఉన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి**


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మే 8 : పేద ప్రజలు వైద్యం కోసం సీఎం సహాయనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని తన నివాసం వద్ద సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రైవేట్ దవాఖానల్లో వైద్యం చేయించుకున్న బడుగు బలహీన వర్గాల ప్రజలకు సీఎంఆర్‌ఎఫ్ అండగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, మాజీ సర్పంచ్ మర్సుకోల సరస్వతి తదితరులు ఉన్నారు.

# హ్యాట్సాఫ్ సిందూర్





## త్రివిధ దళాలకు అభినందనల వెల్లువ

- భారత సైనికులు విజయం సాధించాలని పూజలు
- యువకులు, రైతులు, అన్ని పార్టీల నాయకుల ర్యాలీ
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బాణసంచా కాల్చి, స్వీట్ల పంపిణీ

*పాక్ ఉగ్రమూకల అంతమే లక్ష్యంగా ప్రారంభమైన ఆపరేషన్ సిందూర్‌పై ప్రశంసల వర్షం కురుస్తున్నది. మంగళవారం అర్ధరాత్రి, గురువారం ఉదయం పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్ర శిబిరాలపై మెరుపు దాడులు చేయడంతో దేశంలోని పౌరులు, అన్ని పార్టీల నాయకులు సంబురాలు చేసుకుంటున్నారు. పహల్గాంకు ప్రతీకారం తీర్చుకుంటున్నారని, అందులో మృతి చెందిన వారి ఆత్మలు శాంతిస్తాయని పేర్కొంటున్నారు. తాజాగా గురువారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బీఆర్‌ఎస్ నాయకులు, ఇతర పార్టీల నేతలు, ప్రజలు, రైతులు త్రివిధ దళాలను అభినందించారు. భారత సైనికులు విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ పూజలు చేశారు. బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి ర్యాలీలు నిర్వహించారు.*

*- మంచిర్యాల టౌన్/భీంపూర్/నిర్మల్ అర్బన్/భైంసా, మే 8*


భీంపూర్ : విజయోత్సవ ర్యాలీలో గ్రామస్తులు

### త్రివిధ దళాలకు అభినందనలు..

సిందూర్ ఆపరేషన్‌లో పాల్గొన్న భారత త్రివిధ దళాల సైన్యానికి మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు అభినందనలు తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి మాట్లాడారు గత నెలలో జమ్మూ-కశ్మీర్‌లోని పహల్గాంలో 26 మంది అమాయకులను పాకిస్థాన్ ఉగ్రవాదులు పొట్టన పెట్టుకున్నారన్నారు. అభం-శుభం తెలియని అమాయక ప్రజలను చంపడంపై భారత సైన్యం సిందూరం పేరిట ఆపరేషన్ నిర్వహించి ప్రతీకారం తీర్చుకుందని తెలిపారు. ఈ చర్యను యావత్తు భారతదేశంతోపాటు ప్రపంచ దేశాలు ముక్తకంఠంతో సంఘీభావం తెలుపుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు విజిత్‌రావు, కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, గాదె సత్యం, తోట తిరుపతి, పడాల రవీందర్ పాల్గొన్నారు.

### సైనికులు విజయం సాధించాలని పూజలు

భారతదేశ సైనికులకు మద్దతుగా వారు విజయం సాధించాలని గురువారం నిర్మల్ పట్టణంలోని నాయుడివాడ హనుమాన్ ఆలయంలో కాలనీవాసులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంపై హర్షం వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. అలాగే నిర్మల్ పట్టణంలోని శాస్త్రినగర్ కాలనీలో మహిళా కమిటీ ఆధ్వర్యంలో ఆపరేషన్ సిందూర్ విజయంపై మోదీ చిత్రపటానికి వీర తిలకం దిద్దారు. ఈ కార్యక్రమంలో మహిళా బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. భైంసా పట్టణంలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో బీజేపీ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ప్రధాని మోదీ చిత్రపటానికి ఎమ్మెల్యే రామరావు పటేల్ పాలాభిషేకం చేశారు.

### కరంజీ గ్రామస్తుల జేజేలు

ఆపరేషన్ సిందూర్‌పై ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని కరంజీ(టి) గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం యువకులు, రైతులు, అన్ని పార్టీల నాయకులు డప్పువాయిద్యాలతో గ్రామమంతా ర్యాలీగా వెళ్తూ జయజయ నాదాలు చేశారు. బాణసంచా కాల్చి స్వీట్లు పంచారు. ఉగ్రవాదుల అంతానికి భారత్ చర్యలను స్వాగతించారు.



నిర్మల్ పట్టణంలోని నాయుడివాడ హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


మంచిర్యాలలో తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సైన్యానికి మద్దతుగా అభినందనలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు


భీంపూర్ : కరంజిలో బాణసంచా కాల్చుతున్న యువకులు



## మేలుకోకుంటే ముప్పే!

- గతేడాది వరదకు దెబ్బ తిన్న తుంతుంగా చెరువు కాల్వ
- ఇప్పటికీ మరమ్మతులు చేపట్టని అధికారులు
- వానకాలం సమీపిస్తున్నా స్పందించని వైనం
- ఆందోళనలో అన్నదాతలు

కోటపల్లి, మే 8 : గతేడాది పోటెత్తిన వరదకు ఎదుల్లబంధం గ్రామ సమీపంలోని తుంతుంగ చెరువు లెఫ్ట్ కెనాల్ కోతకు గురై ప్రమాదకరంగా మారింది. వానకాలం సమీపిస్తుండగా.. ఇప్పటి వరకు యంత్రాంగం మరమ్మతులు చేపట్టకపోవడం ఆందోళన కలిగిస్తున్నది. ఇకనైనా మేలుకోకుంటే ముప్పుతప్పదని రైతాంగం, ప్రజానీకం హెచ్చరిస్తున్నది. గతేడాది తుంతుంగ చెరువు నుంచి వరద పోటెత్తడంతో లెఫ్ట్ కెనాల్ కోతకు గురైంది. రోడ్డు సైతం ధ్వంసమై దాదాపు ఎనిమిది గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఆ సమయంలో నామమాత్రంగా మరమ్మతులు చేసిన అధికారులు ఇప్పటి వరకూ కన్నెత్తి చూడలేదని, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు, స్థానిక ఎమ్మెల్యే స్పందించి కాలువకు మరమ్మతులు చేపట్టాలని, లేదంటే పంటల సాగు ప్రశ్నార్థకంగా మారుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


గతేడాది కురిసిన వర్షాలకు దెబ్బ తిన్న చెరువు కాల్వను పరిశీలిస్తున్న అధికారులు


నేటికీ మరమ్మతుకు నోచుకోని తుంతుంగ చెరువు కాల్వ

## యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

- రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా
- ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భద్రతపై సమీక్ష


అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న రామగుండం సీపీ

మంచిర్యాల అర్బన్, మే 8 : అన్ని శాఖల సమన్వయంతో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పేర్కొన్నారు. గురువారం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో పలు శాఖల అధికారులతో భద్రతపై సమీక్ష నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ప్రజలకు భద్రతపై అవగాహన కల్పించాలని, ప్రధానమైన సంస్థల ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉంటూ రక్షణ వ్యవస్థ, భద్రతా వ్యవస్థను కట్టుదిట్టం చేయాలని అధికారులను ఆదేశించారు. అత్యవసర సర్వీసులు అందించే విభాగాల ఉద్యోగులు, అన్ని శాఖలు పూర్తి సమన్వయంతో పని చేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసి, నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వెంటనే అమలు చేయాలని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయాశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

**మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్**

లక్షెట్టిపేట, మే 8: కొనుగోలు కేంద్రాల్లో నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం లక్షెట్టిపేట మండలంలోని ఇటిక్యాల, కొత్తూరు, నెల్కివెంకటాపూర్, మోదెల, చందారం, దౌడెపల్లి, పాతకొమ్ముగూడెం, కొత్త కొమ్ముగూడెం, గంపలపల్లి, తిమ్మాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ దవాఖాన నిర్మాణాన్ని పరిశీలించారు. పనులు వేగంగా పూర్తిచేయాలని అధికారులు ఆదేశించారు.


వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్